క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో మంగళవారం ఉదయం జరిగే వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి హాజరు కానున్నారని ఎంపీడీఓ శేషా చలపతి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే మధ్యాహ్నం చిన్నచెప్పలిలో జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు హాజరై ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఇండియన్ ఆర్మీకి ఎంపికైన ఎన్‌సీసీ విద్యార్థులు



ఎంపికైన ఆర్మీ అభ్యర్థులతో కరస్పాండెంట్

జమ్మలమడుగు : పట్టణంలోని ఎన్‌సీసీ విద్యార్థులు ఇండియన్ ఆర్మీకి ఎంపికైనట్లు కాలేజి కరస్పాండెంట్ పి.నాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎస్వీ డిగ్రీ కాలేజీలో ఎంపికైన విద్యార్థులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్మీ పరీక్షల్లో తమ కాలేజికి చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు గురుమోహన్, లక్ష్మీగణేష్, సుధీర్, యశోదకృష్ణ, వేణుగోపాల్, నాగిరెడ్డి హేమంత్‌కుమార్, అలాగే ఎన్ఎస్ఎస్‌కు చెందిన నాగేంద్రబాబు, పవన్‌లు ఎంపికైనట్లు వివరించారు.

ఆణిముత్యం అవార్డుకు ఎంపిక



చాడం నవీన్

జమ్మలమడుగు : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజికి చెందిన చాడం నవీన్ అనే విద్యార్థి జగనన్న ఆణిముత్యం అవార్డుకు ఎంపికై నట్లు కాలేజి ప్రిన్సిపల్ శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కాలేజీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది మొదటి సంవత్సరంలో సీఈసీలో 934 మార్కులు సాధించడంతో జగనన్న ఆణిముత్యం అవార్డుకు ఎంపికైనట్లు వివరించారు. ఈనెల 25వతేదీన నవీన్ తల్లిదండ్రులకు ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్ రెడ్డి చేతుల మీదుగా సన్మాన కార్యక్రమం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

కేతు విశ్వనాథరెడ్డి మృతి విచారకరం

కమలాపురం : కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, కథా రచయిత, సాహితీవేత్త కేతు విశ్వనాథరెడ్డి మృతి విచారకరమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. సోమవారం కమలాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పాఠశాల స్థాయి నుంచి విశ్వ విద్యాలయ స్థాయి దాకా అనేక పాఠ్య పుస్తకాలకు సంపాదకత్వం వహించి పాఠ్య ప్రణాళికలను రూపొందించారన్నారు. ఆయన జీవిత కాలంలో అనేక పురస్కారాలు అందుకున్నారని గుర్తు చేశారు.

పెద్దపసుపులలో ‘మన ఊరు మన బడి’

పెద్దముడియం : బడి బాట కార్యక్రమంలో భాగంగా పెద్దపసుపుల గ్రామంలో మన ఊరు మన బడి కార్యక్రమాన్ని మండల విద్యాశాఖాధికారి శివప్రసాద్ నిర్వహించారు. ఐదేళ్లు పూర్తయిన వారిని ఒకటో తరగతిలో, ఐదో తరగతి పూర్తయిన వారిని 6వ తరగతిలో చేర్పించాలని సూచించారు. అలాగే ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని కోరారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు,అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



ఉపాధి కూలీలకు పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్న అటవీ శాఖ అధికారులు

ఎర్రగుంట్ల : ప్రతి ఒక్కరూ వారి జీవన శైలిలో మార్పుల ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చుని ముద్దనూరు డిప్యూటీ ఎఫ్ఆర్ఓ జేడీ రత్నరాజు తెలిపారు. సోమవారం చిలంకూరు గ్రామం పరిధిలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధం, గుడ్డ సంచుల వాడకం, అవసరం లేని వస్తువులను ఎక్కడపడితే అక్కడ వేయకూడదని, మొక్కలు నాటి సంరక్షించాలని తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి మురళి, నాయకులు రఘునందన్‌రెడ్డి, ముస్తఫా, ఫీల్డ్ అసిస్టెంట్ ఓబులమ్మ, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కేజీ పీజీసెట్-23కి చక్కటి స్పందన

వైవీయూ : కడప నగరంలోని కందుల గ్రూప్ (కేజీ) ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన కేజీ పీజీసెట్-2023కు చక్కటి స్పందన లభించిందని కళాశాల ఎండీ కందుల చంద్ర ఓబులరెడ్డి తెలిపారు. కడప, చిత్తూరు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరై పరీక్ష రాశారని తెలిపారు.

విద్యార్థుల ఉన్నతికి గ్రంథాలయాల తోడ్పాటు



తెలుగు భాష గొప్పతనం గురించి వివరిస్తున్న ఉపాధ్యాయుడు సిద్దయ్య



విద్యార్థులకు నీతి కథలు బోధిస్తున్న గ్రంథాలయాధికారి నాగాంజలి

పులివెందుల టౌన్ : విద్యార్థుల ఉన్నతికి గ్రంథాలయాలు ఎంతో దోహదపడతాయని ఉపాధ్యాయుడు జయరాజ్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిబిరంలో భాగంగా విద్యార్థులకు గ్రంథాలయాల ఆవశ్యకత, గ్రంథాలు చదవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ కృష్ణకిశోర్‌రెడ్డి, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞాన సముపార్జన

కొండాపురం : గ్రంథాలయాలతో పిల్లలు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని విశ్రాంత ఉపాధ్యాయుడు అంజనేయులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలోని వేసవి శిబిరంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు గ్రంథాలయంలోని మంచి మంచి పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది వరలక్ష్మి పాల్గొన్నారు.

విజ్ఞాన వికాసం కోసమే శిబిరాలు

కమలాపురం : చిన్నారుల్లో విజ్ఞాన వికాసం కోసమే ప్రభుత్వం వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు స్థానిక కమలాపురం శాఖా గ్రంథాలయాధికారి నాగాంజలి తెలిపారు. సోమవారం చిన్నారులకు ఆమె చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. అనంతరం పుస్తక పఠనంపై శిక్షణ నిచ్చారు. పుస్తక పఠనం ప్రతి రోజు చేయాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి రోజు గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



పిల్లలతో మాట్లాడుతున్న విశ్రాంత ఉపాధ్యాయుడు

దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలించిన ఓఎస్డీ



గాలివానకు దెబ్బతిన్న అరటి పంటను పరిశీలిస్తున్న ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, తదితరులు

పులివెందుల రూరల్ : ఈదురు గాలులకు దెబ్బతిన్న అరటి తోటలను ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షం, ఈదురుగాలులకు నియోజకవర్గంలోని అరటి తోటలు నేలకొరిగాయి. ఈ క్రమంలో వెలమవారిపల్లె, ఇ.కొత్తపల్లె గ్రామాల్లో దెబ్బతిన్న అరటి పంటలను ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఎన్ని ఎకరాలలో పంటలు దెబ్బతిన్నాయో వాటిని క్షేత్రస్థాయిలో పక్కాగా గణన చేపట్టాలని ఉద్యాన శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. ఆయన వెంట మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు, డీడీ లావణ్య, తహసీల్దార్ మాధవ కృష్ణారెడ్డి, హెచ్ఓ రాఘవేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణ పూర్తి చేసుకున్న డ్రైవర్లకు సర్టిఫికెట్లను అందజేసిన కడప డిపో మేనేజరు ఢిల్లీశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప పార్లమెంటు నియోజకవర్గంలోని కడప డిపోలో ఏపీఎస్ ఆర్టీసీ ద్వారా డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్నామని దీనిని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కడప డిపో మేనేజరు ఢిల్లీశ్వరరావు తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో శిక్షణ తీసుకున్న డ్రైవర్లకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ఇప్పటివరకు 14 బ్యాచ్‌లు పూర్తి చేశామని, 15 బ్యాచ్‌కు సర్టిఫికెట్లను అందజేశామన్నారు. 16 బ్యాచ్‌కు అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. ఒక్కో బ్యాచ్‌కు 16 మంది అభ్యర్థులకు శిక్షణ ఇస్తున్నామని, 30 ఏళ్ల అనుభవం కలిగిన రీజనల్ సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ చేత థియరీ, ప్రాక్టికల్ తరగతులు నిర్వహి/స్తున్నామని వివరించారు. డ్రైవింగ్ నేర్చుకోదలచిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 16 బ్యాచ్‌కు అడ్మిషన్లు జరుగుచున్నాయని, కొద్ది సీట్లు మాత్రమే ఉన్నాయని ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్స్ కృష్ణారెడ్డి, జబ్బార్, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో మైనార్టీలకు సముచిత స్థానం



మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు

వేంపల్లె : వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీలకు సముచిత స్థానం కల్పిస్తోందని మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ ముజీబ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలో ఉన్న వైఎస్సార్ సమాధిని ఆయన దర్శించుకున్నారు. అంతకుముందు వేంపల్లెలోని హనుమాన్ జంక్షన్‌లో వైఎస్సార్‌సీపీ సేవాదళ్ అధ్యక్షుడు రఫీ ఆధ్వర్యంలో ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్ ముజీబ్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కోసం పనిచేసిన కార్యకర్తలను సీఎం జగన్ గుర్తించి పదవులు కేటాయిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు గౌస్‌పీర్, ఫిరోజ్, అమీర్ బాషా, ఇస్మాయిల్ అసిస్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు బారికేడ్ల ఏర్పాటు



నక్కలపల్లె రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

సింహాద్రిపురం : మండలంలోని పలు ప్రాంతాల్లో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండటంతో రోడ్డు ప్రమాదాల నివారణకు బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఎస్ఐ రోషన్ ఆధ్వర్యంలో సింహాద్రిపురం మండల కేంద్రం సమీపంలోని నిడివెల్ల క్రాస్ వద్ద, అలాగే బలపనూరు పంచాయతీ పరిధిలోని పులివెందుల - సింహాద్రిపురం ప్రధాన రహదారిలోని నిడివెల్ల గ్రామ సమీపంలోనూ, సింహాద్రిపురం నుంచి యల్లనూరుకు వెళ్లే క్రాస్ రోడ్డు వద్ద ఈ బారికేడ్లను ఏర్పాటు చేశారు.

చెరువులో పడి యువకుడి మృతి



శ్రీరాముల అశోక్ (ఫైల్)

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన శ్రీరాముల అశోక్ (17) అనే యువకుడు గూడెంచెరువు గ్రామంలోని గూడాదేవి చెరువులో పడి మృతి చెందాడు. ఎస్ఐ సుబ్బారావు కథనం మేరకు.. శ్రీరాముల అశోక్ శనివారం తల్లి, కుటుంబ సభ్యులకు బయటకు వెళ్లి వస్తా అని చెప్పి శనివారం ఇంటి నుంచి వెళ్లాడు. కాగా రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో బంధువులకు ఫోన్లు చేసి విచారించారు. అయినా ఫలితం లేదు. సోమవారం గూడెంచెరువు గ్రామంలోని గూడాదేవి చెరువులో మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని బయటకు తీసి చూడగా బీసీ కాలనీకి చెందిన అశోక్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అట్టహాసంగా ‘జైత్ర’ ప్రీ రిలీజ్ ఈవెంట్



జైత్ర సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు తదితరులు

కడప కార్పొరేషన్/రూరల్:వ్యవసాయం ప్రధాన అంశంగా సుభాష్ నిర్మాణ సారథ్యంలో మల్లికార్జున దర్శకత్వంలో చిత్రీకరణ పూర్తి చేసుకున్న ‘జైత్ర’ ప్రీ రిలీజ్ వేడుక కడప నగరంలోని వైఎస్సార్ ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు, వైఎస్సార్‌సీపీ నేత కల్లూరు నాగేంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను రాయలసీమ యాసలో ఇందులో చక్కగా చూపారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయనకులు షఫీ, భరత్, కో డైరెక్టర్ ధనుంజయరెడ్డి, హేమా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘జైత్ర’ సినిమాను జయప్రదం చేయాలి

మంచి సందేశంతో నిర్మించిన జైత్ర సినిమాను జయప్రదం చేయాలని ఆ చిత్ర దర్శకులు మల్లికార్జున్ తోట తెలిపారు. సోమవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ఆ చిత్రం యూనిట్ సినిమాకు సంబంధించిన అంశాలను వెల్లడించారు. ఈ ఈ నెల 26వ తేదీన విడుదలవుతున్న తమ చిత్రంను జయప్రదం చేయాలని కోరారు. నిర్మాత అల్లం సుభాష్, హీరో, హీరోయిన్ సన్నీ నవీన్, రోహిని రేచల్ మాట్లాడుతూ ఈ చిత్రం తమకు మంచి పేరును తెస్తుందనే ఆశా భావంను వ్యక్తం చేశారు.

మోసపూరిత యాప్‌లను అరికట్టండి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జీవీ ఫుట్‌బాల్, మూన్ ఫుట్‌బాల్ లాంటి ఆన్‌లైన్ మోసపూరిత యాప్‌ల నుంచి ప్రజలను కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. ఈ విషయమై సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ తుషార్ దూడికి సీపీఐ నాయకులు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు జీవీ, మూన్ ఫుట్‌బాల్ లాంటి ఎన్నో ఆన్‌లైన్ మోసపూరిత యాప్‌లను ప్రవేశపెట్టి ప్రజలను దోచుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. జిల్లాలో 50 వేల మందికి పైగా ఆత్యాశకు గురై దాదాపు రూ.100 కోట్ల వరకు జీవీ, మూన్ ఫుట్‌బాల్ యాప్‌లో ఇన్వెస్ట్ చేశారన్నారు. ఇటువంటి ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా ప్రజలు నష్టపోకుండా సైబర్ నేరగాళ్ల బారి నుంచి ప్రజలను అప్రమత్తం చేసి కాపాడాలన్నారు.

బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలి

వైవీయూ : ప్రభుత్వం నిర్వహించనున్న ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియను వివాదాలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పి. రమణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎండీ ఇలియాస్‌బాషా కోరారు. సోమవారం కడప నగరంలోని వీణావిజయరామరాజు ఎస్టీయూ భవన్‌లో వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీల కోసం జీఓనెం. 47 జారీచేసిందన్నారు. ఈ ఉత్తర్వుల మేరకు బదిలీలు ఉమ్మడి జిల్లాల యూనిట్‌గా నిర్వహించనున్నట్లు తెలిపారు. బదిలీలకు దరఖాస్తు చేసుకునేందుకు మినిమం సర్వీసు జీరోగా నిర్ణయించినందున అందరూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 8 ఏళ్లు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుందన్నారు. రీ అపోర్స్‌మెంట్‌నకు గురైన జూనియర్ ఉపాధ్యాయునికి 5 పాయింట్లు ఇస్తామనే నిబంధన తొలగించి, విల్లింగ్ ఇచ్చిన సీనియర్‌కు కూడా పాయింట్లు వర్తింపచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర మున్సిపల్ విభాగం కన్వీనర్ టి. రవిశంకర్‌రెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి మహబూబ్‌బాషా, సాధిక్‌అలీ, సంజీవరాయయుడు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలో దళితులకు పెద్దపీట

కడప కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో దళితులకు పెద్దపీట వేశారని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా ఉన్న కొన్ని దళిత సంఘాలు విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి దళితులకు ఎలాంటి పథకాలు అందలేదని చెప్పడం దారుణమన్నారు. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఏ పార్టీ ఇవ్వని విధంగా దళిత మహిళను ఉప ముఖ్యమంత్రిని చేసి హోంశాఖ ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ఎస్సీలకు ఐదు మంత్రి పదవులు ఇవ్వడం కూడా గొప్ప విషయమేనన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బండి రమణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆలయ హుండీ సొమ్ము లెక్కింపు

కడప కల్చరల్ : కడప నగరం మృత్యుంజయకుంటలోని శ్రీ మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. దేవాదాయశాఖ కార్యనిర్వహణాధికారి వి.సురేష్‌కుమార్ పర్యవేక్షణలో ఆలయ ఈఓ శ్రీధర్ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ఏడాది మార్చి 17 నుంచి మే 22వ తేది వరకు హుండీల ద్వారా మొత్తం రూ. 57,737 సమకూరినట్లు వారు తెలిపారు. ఆలయ అర్చకులు ఎస్.సతీష్ శేఖర్, ఎస్.దక్షిణామూర్తి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ ఉత్తర్వుల్లోని అసంబద్ధాలను తొలగించాలి

వైవీయూ: ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన ఉత్తర్వు 47లో ఉన్న అసంబద్ధాలను తొలగించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామసుబ్బయ్య, సీవీ ప్రసాద్ కోరారు. ఉపాధ్యాయుల ఖాళీల కోసం ప్రాతిపదికగా తీసుకునే తేదీని ఆగస్టు 2022 నుంచి మార్చి 2023కు మార్చాలని కోరారు. రేషనలైజేషన్‌కు గురయ్యే ఉపాధ్యాయులకు ప్రస్తుత స్టేషన్ పాయింట్లు ఇవ్వబడవన్న నిబంధనకు సవరణలు ఇవ్వాలన్నారు. ఖాళీలను బ్లాక్ చేసే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

సమస్యలు వెంటనే పరిష్కరించాలి



జయమ్మ కాలనీలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిని పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహారెడ్డి

పులివెందుల టౌన్ : సమస్యలు తెలుసుకున్న వెంటనే అధికారులు తక్షణమే స్పందించాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పేర్కొన్నారు. గత రాత్రి కురిసిన భారీ వర్షానికి చెట్లు విరిగి కడప రోడ్డులో అడ్డంగా పడిపోయాయి. మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ సిబ్బందితో కలిసి పోలీసుల సహకారంతో రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టును తొలగించి ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడ ఏ సమస్య వచ్చినా అధికారులతో కలిసి వెంటనే పరిష్కరిస్తామన్నారు. అలాగే మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి సోమవారం మున్సిపల్ అధికారులతో కలిసి పట్టణంలోని జయమ్మ కాలనీలో పర్యటించారు. కార్యక్రమంలో శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రిక్వెస్ట్ బస్టాప్ ఏర్పాటు చేయాలి



ఆర్టీసీ డీఎం ఉమామహేశ్వరరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న సర్పంచ్, తదితరులు

పులివెందుల రూరల్ : పులివెందుల ఆర్టీసీ డిపో నుంచి తేలూరు, సైదాపురం గ్రామాల సమీపంలో ఉన్న బీవీఎస్ఆర్ లారీ ట్రాన్స్‌పోర్ట్ గ్యారేజీ వద్ద రిక్వెస్ట్ బస్టాప్ ఏర్పాటు చేయాలని ఆర్టీసీ డీఎం ఉమామహేశ్వరరెడ్డికి వినతి పత్రం అందించారు. సోమవారం స్థానిక పులివెందుల ఆర్టీసీ బస్టాండు డీఎం కార్యాలయంలో ఉన్న ఆర్టీసీ డీఎం ఉమామహేశ్వరరెడ్డిని తేలూరు గ్రామ సర్పంచ్ రామసుబ్బారెడ్డి, బీవీఎస్ఆర్ ట్రాన్స్‌పోర్ట్ యజమాని సుబ్బారెడ్డి, గ్రామస్తులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులివెందుల నుంచి ప్రొద్దుటూరుకు వెళ్లే ఆర్టీసీ బస్సులను బీవీఎస్ఆర్ ట్రాన్స్‌పోర్ట్ లారీల గ్యారేజీ వద్ద ఆపే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది కుళ్లాయప్ప, ఆచారి, గోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి లక్ష్యంగా పనిచేద్దాం



కిట్లను పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ శానిటేషన్ సిబ్బందికి కిట్లు పంపిణీ

జమ్మలమడుగు : మున్సిపాలిటి అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా అధికారులు కౌన్సిలర్లు అందరం కలిసి కట్టుగా పనిచేద్దామని మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నిరుపేదలందరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన సమస్యలను గుర్తించి వాటిని త్వరగా పరిష్కరించుకుందామని సూచించారు. స్థానిక శాసనసభ్యుడు మూలె సుధీర్‌రెడ్డి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఇంటిలో మొక్కలు నాటాలన్నారు. ఇళ్ల నిర్మాణం కోసం ఇష్టమొచ్చినట్లు చెట్లను నరకడం మంచిదికాదన్నారు. మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ కిట్లను పంపిణీ చేశారు. మున్సిపల్ సమావేశం అనంతరం మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన పారిశుద్ధ్య సిబ్బందికి చెప్పులు, నూనె పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ అధికారి నూర్‌బాషా, కౌన్సిలర్ ముల్లాజానీ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల కోసం పేర్లు నమోదు చేసుకోండి



విత్తన నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు

వీరపునాయునిపల్లె : వేరుశనగ పంట సాగు చేసే రైతులు విత్తనాల కోసం రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు అన్నారు. సోమవారం మండలంలోని కొమ్మద్ది రైతు భరోసా కేంద్రంలో వేరుశనగ విత్తన నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం వీరపునాయునిపల్లె మండలానికి కె6రకం 4 వందల క్వింటాళ్లు వేరుశనగ విత్తనాలు మంజూరయ్యాయన్నారు. రైతులకు 40శాతం రాయితీతో అందజేస్తామన్నారు. ప్రభుత్వం ధర కిలో రూ.93 ఉండగా రాయితీ పోను రూ.37.20 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

నేటి నుంచి సబ్సిడీ వేరుశనగ కాయలు పంపిణీ

కొండాపురం : ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే రైతులందరికి రైతు భరోసా కేంద్రాల్లో 2023 సంవత్సరానికి సంబంధించిన సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలు మంగళవారం నుంచి అందజేయనున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారి పి. అరుణకుమారి తెలిపారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ వేరుశనగ విత్తన కాయలు 40 శాతం సబ్సిడీతో రైతులకు ఇస్తున్నట్లు తెలిపారు. వేరుశనగ కాయలు 30 కేజీల ప్యాకెట్ పూర్తి ధర రూ. 2790 ఉండగా సబ్సిడీ పోను రూ. 1674తో రైతులకు అందజేస్తామన్నారు. మండలంలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సబ్సిడీ వేరుశనగ కాయలు మంజూరు

లింగాల : లింగాల మండలానికి సబ్సిడీ వేరుశనగ కాయలు మంజూరయ్యాయని ఏఓ రమేష్ తెలిపారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలకు ఖరీఫ్ వేరుశనగ పంట సాగు కోసం 500 క్వింటాళ్ల వేరుశనగ కాయలు మంజూరయ్యాయన్నారు. వీటిని రైతులకు 40శాతం సబ్సిడీతో అందిస్తున్నామని తెలిపారు. పూర్తి ధర క్వింటా రూ.9300 కాగా.. రైతులకు రూ.550 కు అందిస్తున్నామన్నారు. కావాల్సిన రైతులు వారి పేర్లను ఆర్‌బీకేలలో నమోదు చేసుకోవాలని సూచించారు.


వాణిజ్యసముదాయ పనులకు భూమి పూజ



భూమి పూజ నిర్వహిస్తున్న మంత్రులు అంజద్‌బాషా, ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా పరిషత్ ప్రాంగణంలో రూ.1.40 కోట్లతో కొత్తగా నిర్మించతలపెట్టిన 24 గదుల వాణిజ్య భవన సముదాయ నిర్మాణ పనులకు సోమవారం ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు పి.రామసుబ్బారెడ్డి, రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్‌కుమార్, జేసీ గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

‘బ్రౌన్’ కేంద్రం అభివృద్ధికి కృషి చేస్తా!



గ్రంథాలను పరిశీలిస్తున్న వీసీ చింతా సుధాకర్

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉప కులపతి సుధాకర్ అన్నారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన తొలిసారిగా సోమవారం సాయంత్రం బ్రౌన్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఉద్యోగులంతా సమిష్టి కృషితో ఈ కేంద్రాన్ని అభివృద్ధి పథంలో పయనింపజేయాలని సూచించారు.